క్లుప్తంగా

కులగణనపై శిక్షణ


అల్వాలలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: మండల పరిధిలోని అల్వాల రైతు వేదిక వద్ద బుధవారం కుల గణనపై ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కులగణన నిర్వహిస్తోందని తెలిపారు. నవంబర్ 6నుండి నిర్వహించే ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. 135 మంది ఎన్యూమరేటర్లు, 14 మంది సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజారత్నం, తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీఓ కిష్టయ్య, మండల వ్యవసాయ అధికారి శిరీష, ఏఈలు నర్సింగ్‌రావు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

6నుంచి కుల గణన..


కొత్తూరులో ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇస్తున్న కమిషనర్ బాలాజీ

కొత్తూరు: గ్రామాలు, పట్టణాల్లో నవంబర్ 6నుంచి కుల గణన చేపట్టనున్నట్లు కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఎన్యురేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఎన్యుమరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేయాలని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య అన్నారు. వికలాంగుల సంక్షేమ జిల్లా అధికారి సంధ్యారాణిని ఆయన బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. దివ్యాంగుల బడ్జెట్‌ను.. వారికే ఖర్చు చేయాలని కోరారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి, వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి చిట్టి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజు, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి నాగరాజు, ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు శంకర్, శ్రీనివాస్, లింగమయ్యలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

కడ్తాల్: మండల కేంద్రంలో ఇటీవల నూతనంగా తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం కావడంతో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జర్పుల దశరథ్ నాయక్ హర్షం వ్యక్తంచేశారు. బుధవారం తహసీల్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన.. తహసీల్దార్ ముంతాజ్‌ను శాలువాతో సన్మానించారు. మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, పాండునాయక్, ఉన్నారు.

ఆర్డీఓకు సన్మానం


ఆర్డీఓను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కందుకూరు: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డిని బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్ద నర్సింహ, నాయకులు కుమార్, యాదయ్య, కృష్ణయ్య, జంగయ్య, లక్ష్మయ్య, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు నరసింహ పాల్గొన్నారు.

దిమ్మె కూలిందా..

ట్రాన్స్‌ఫార్మర్ గోవిందా

- శిథిలావస్థలో ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలు
- ఆందోళనలో రైతులు, ప్రజలు
- అధికారులు స్పందించాలని వినతి

మొయినాబాద్: పలు చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన వీటి దిమ్మెలు శిథిలావస్థకు చేరి, కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మొయినాబాద్ మండలంలోని చందానగర్, సురంగల్ గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలు పూర్తిగా శిథిలమై, ఏక్షణమైనా కూలిపోయే స్థితికి చేరాయి. చందానగర్‌లో రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె పూర్తిగా ధ్వంసమైంది. సురంగల్ శివారుల్లోని వ్యవసాయ పొలాల వద్ద ఏర్పాటు చేసిన పలు ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఇదే దుస్థితిలో ఉన్నాయి. ప్రమాదాలు జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.


సురంగల్‌లో కూలడానికి సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె


చందానగర్‌లో శిథిలావస్థకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

పేదల ప్రభుత్వం కాంగ్రెస్

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చేవెళ్ల: కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. నియోజకవర్గానికి చెందిన 97 మందికి బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ పేదలకు అండగా ఉంటుందని తెలిపారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో దోహదం చేస్తోందన్నారు. 97 మందికి వచ్చిన రూ.39,47,000 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, నాయకులు ఎం.కృష్ణారెడ్డి, రాములు, ఆగిరెడ్డి, మల్లేశ్, టేకుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన..


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

గురుకుల పాఠశాలల బాలికలు క్రీడల్లో ప్రతిభ చాటడం అభినందనీయమని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. చేవెళ్ల మండలంలో కొనసాగుతున్న మియాపూర్‌కు చెందిన మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాల విద్యార్థినులకు బుధవారం ఆయన అభినందించారు. అండర్ 17, అండర్ 14 విభాగాల్లో నిర్వహించిన పలు క్రీడల్లో సత్తాచాటిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఏటీపీ నీతా, పాఠశాల ప్రిన్సిపాల్ నర్సింహ, పీఈటీ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు సుభాషిణి, వార్డెన్ ఫాతిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తుక్కుగూడ మహాసభకు తరలిరావాలి

షాబాద్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నవంబర్‌6న నిర్వహించనున్న హలో మాదిగ చలో తుక్కుగూడ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకుడు కొత్తూరు రమేష్‌కుమార్ కోరారు. బుధవారం ఆయన షాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నిర్వహించనున్న సభకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని నలుమూలల నుంచి తరలిరావాలని కోరారు.

బోడకొండలో వీధి దీపాల ఏర్పాటు

మంచాల: మండల పరిధి బోడకొండ గ్రామంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో వీధిలైట్లను ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొర్ర పాండు బుధవారం తెలిపారు. గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు తెస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలాజీ దాస్, దేవరాం నాయక్, శ్రీనువాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పట్నం బస్టాండ్‌లో దీపావళి వేడుకలు


వేడుకల్లో డిపో మేనేజర్ తదితరులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో దీపావళి వేడుకలను బుధవారం ఆర్టీసీ అధికారులు ఘనంగా నిర్వహించారు. మహిళలు, విద్యార్థినులతో కలిసి బస్టాండ్‌లో ముగ్గులు వేసి, దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా డీపో మేనేజర్ వెంకటనర్సప్ప ప్రయాణికులు, ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బస్టాండ్ మేనేజర్ దుశ్శాసన్, ఏడీసీ సదానందం, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

మంచాల: పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పార్టీ పీసీసీ సభ్యుడు, ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జాపాల గ్రామానికి చెందిన నోముల నిఖిల్ వైద్యం ఖర్చుల నిమిత్తం.. మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో రూ.3లక్షలు ఎల్‌ఓసీని ఆయన అందజేశారు. ప్రభుత్వం అందజేసే సాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఓరిగంటి మహేశ్‌గౌడ్, ప్రదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సభను జయప్రదం చేయండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

షాద్‌నగర్: కొత్తగూడెంలో నవంబర్ 6న నిర్వహించే ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభను జయప్రదం చేయాలని టీమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఇటుక రాజు కోరారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విజయోత్సవ సభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేశామని తెలిపారు. విద్యార్థి సంఘాల నాయకులు, మాదిగలు, మహిళా సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో హాజరై వర్గీకరణ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపాగ జంగయ్య మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు కర్రె కృష్ణయ్య, గాదెపాగ ప్రకాశ్‌బాబు, కృష్ణయ్య, ప్రకాశ్, బాబు, కృష్ణయ్య, రవి, సందీప్, బాలస్వామి, అభిషేక్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు!


ప్రమాదకరంగా మారిన కల్వర్టు

తాళ్లగూడ శివారులోని కల్వర్టు వాహనదారులను బెంబేలెత్తిస్తోంది. రక్షణ దిమ్మెలు లేకపోవడంతో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళ ఎదురుగా ఏదైనా వాహనం వస్తే రెయిలింగ్ లేని కారణంగా కిందపడిపోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా కల్వర్టు వద్ద రక్షణదిమ్మెలు కట్టించాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. – కొత్తూరు

కష్టపడి పనిచేస్తే తగిన గుర్తింపు

- సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

కొందుర్గు: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని శ్రీరంగాపూర్, పాత ఆగిర్యాల, కొత్త ఆగిర్యాల, లాలపేట, చిన్న ఉమ్మెంత్యాల, ముట్పూర్, టేకులపల్లి, మహదేవ్‌పూర్, పులుసుమామిడి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలోని ఏగ్రామానికి వెళ్లినా కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని తెలిపారు. ప్రతిఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు ప్రముఖ్ లక్ష్మీకాంత్ రెడ్డి, నాయకులు శివారెడ్డి, శ్రీనివాసు, అశోక్, మహేందర్ రెడ్డి, నరేందర్, మహేష్, రవీందర్ రెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.


కొందుర్గు మండలం ఉమ్మెంత్యాలలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

విత్తన ఎంపిక కీలకం


వాల్‌పోస్టర్‌ను అవిష్కరిస్తున్న ఏడీఏ రాజారత్నం

- నాణ్యమైన సీడ్‌తోనే అధిక దిగుబడి
- ఏడీఏ రాజారత్నం

కేశంపేట: ఆశించిన స్థాయిలో పంటల దిగుబడి సాధించాలంటే విత్తనాల ఎంపిక చాలా కీలకమని ఏడీఏ రాజారత్నం అన్నారు. తెలంగాణ సీడ్ కార్పొరేషన్ సంస్థ వారు అందించే విత్తనాల వాల్ పోస్టర్‌ను బుధవారం మండల పరిధిలోని అల్వాల రైతు వేదికలో అవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలు అందిస్తున్నామని తెలిపారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో ఇవి అందుబాగులో ఉన్నాయని స్పష్టంచేశారు. 25 కిలోల శనగ విత్తనాల బస్తా సబ్సిడీపై రూ.2,250 అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శిరీష, ఎంపిఓ కిష్టయ్య, మండల వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్, ఏపీఎం భగవంతు, జానిబాబా తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా సర్వే


షాబాద్: మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున ఎంపీడీఓ అపర్ణ


కొందుర్గు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీఓ లాలయ్య

- కుటుంబ వివరాలను పక్కాగా నమోదు చేయాలి
- తహసీల్దార్ రమేశ్‌కుమార్
- కొందుర్గు, జిల్లేడ్‌చౌదరిగూడలో ఎన్యూమరేటర్లకు శిక్షణ

కొందుర్గు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రమేశ్ కుమార్ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయం సమావేశం హాలులో ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఇంటిని పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీఓ లాలయ్య మాట్లాడుతూ.. మండలంలోని 22 గ్రామ పంచాయతీలను సర్వేకు అనుకూలంగా 71 ఈబీలుగా విభజించామన్నారు. సర్వే కోసం 62 మంది ఎన్యూమరేటర్లను నియమించామని తెలిపారు. ఆరుగురు సూపర్‌వైజర్లు సర్వేను పర్యవేక్షిస్తారన్నారు. నవంబర్ 1 నుంచి ఎన్యూమరేటర్లు ఆయా గ్రామాల్లో పర్యటించి వారికి సంబంధించిన బ్లాకులో ఇళ్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అనురాధ, ఏపీఓ నర్సింగ్‌రావు, ఏపీఎం జయమాలిని, పంచాయతీ కార్యదర్శులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లేడ్ చౌదరిగూడలో..

జిల్లేడ్ చౌదరిగూడ రైతువేదికలో బుధవారం ఎన్యూమరేటర్లకు శిక్షణ నిర్వహించారు. మండలంలోని 24 గ్రామపంచాయతీలను 79 ఈబీలుగా విభజించామని, 75 మంది ఎన్యూమరేటర్లు సర్వే చేపడుతారని ఎంపీఓ హన్మంత్‌రెడ్డి అన్నారు. ఏడుగురు సూపర్‌వైజర్లు సర్వేను పర్యవేక్షిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి సర్వే..

షాబాద్: ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, ఎంపీడీఓ అపర్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం, రైతువేదికలో బుధవారం ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నవంబర్ 1నుంచి గ్రామాల్లో ఇంటింటి సర్వే ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ వీరాసింగ్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోండి

ఆమనగల్లు: నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో కొనసాగుతున్న ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓ పాండుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. లెనోరా ప్రైడ్ స్కూల్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నితిన్, మల్లేశ్, చింటు తదితరులు పాల్గొన్నారు.


ఎంఈఓ పాండుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


మొయినాబాద్‌లో పూల విక్రయం


ప్రత్యేకంగా వెలసిన టపాసుల షాపు

కాంతుల కేళి దీపావళి

వెలుగుల పండుగ దీపావళిని వైభవంగా నిర్వహించుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పూలు, ప్రమిదలు, టపాసుల కొనుగోలులో బిజీగా కనిపించారు. పండుగను పురస్కరించుకుని షాపింగ్ కాంప్లెక్సులు, కార్యాలయాలు, దుకాణాలను విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. కిలో బంతిపూలను రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయించారు. – మొయినాబాద్


మొయినాబాద్‌లో భవనాలకు విద్యుత్ దీపాలతో అలంకరణ